ప్రజా సమస్యలపై ప్రభుత్వాల నిర్లక్ష్యం

హిమాయత్‌నగర్, జూలై 14: ప్రజా సమస్యల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరిని అవలంభిస్తున్నాయని సీపీఐ నగర కార్యదర్శి ఎస్. ఛాయదేవి అన్నారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లోని ఎన్ఎన్‌రెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల ముందు పేదలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వాలను అమలు చేయాలని అన్నారు. వర్షాకాలం ముంపు ప్రాంతాలను ముందుగానే గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. మూసీ నది పరివాహక ప్రాంతాల్లో నివాసం ఉండే పేదలకు మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. దోమల వల్ల వచ్చే మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, మెదడు వాపు, బోధకాలు వంటి వ్యాధులు వ్యాప్తి చెందకుండా బస్తీలు, కాలనీలో మెడికల్ క్యాంప్‌లను నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నేడు బంజారాహిల్స్‌లో యువజనోత్సవాలు

జూబ్లీహిల్స్, జూలై 14: సెట్విన్ ఆధ్వర్యంలో నేడు ప్రపంచ యువ జన నైపుణ్య దినోత్సవం నిర్వహించనున్నారు. బంజారాహిల్స్‌లోని సేవాలాల్ బంజారా భవన్‌లో ఉదయం 11 గంటలకు వేడుకలను మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించనున్నట్లు సెట్విన్ ఎండీ వేణుగోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సెట్విన్ పర్యావరణ సంస్థలు ప్రదర్శనలు, బ్యూటీషియన్ విద్యార్థులతో బ్రైడ్స్ ఆఫ్ ఇండియా షోతో పాటు తెలంగాణ చేనేత వస్త్రాలు, పోచంపల్లి, గద్వాల్, నారాయణపేట, గొల్లభామ చీరలతో ఫ్యాషన్ డిజైనింగ్ విద్యార్థుల సంప్రదాయ ఫ్యాషన్ షో ఉంటుందని వెల్లడించారు. వేడుకల్లో ఎమ్మెల్యే దానం నాగేందర్, మేయర్ గద్వాల విజయలక్ష్మి, కార్పొరేటర్ కవితారెడ్డి, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్సీలు సురభి వాణీదేవి, మీర్జా రెహ్మత్ బేగ్ ఖాద్రి, రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ ముఖ్య కార్యదర్శి ఎ.వాణీప్రసాద్ పాల్గొంటారని తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషిచేయాలి


మాజీ మంత్రి కేటీఆర్‌తో మణికొండ మున్సిపల్ బీఆర్ఎస్ నాయకులు

బీఆర్ఎస్ నేతలతో మాజీ మంత్రి కేటీఆర్

మణికొండ, జూలై 14: ప్రజల్లో ఉంటూ వారి సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎన్నికల సమయంలో ప్రణాళిక, సమన్వయ వ్యూహకర్తగా వ్యవహరించిన సీతారాం ధూళిపాళ ఆదివారం మాజీ మంత్రి కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ బలోపేతం, పురోగతిని దృష్టిలో ఉంచుకొని మణికొండలో పార్టీ నాయకులతో, కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేస్తే తాను తప్పకుండా హాజరుతారని వారికి సూచించారు. నిరంతరం ప్రజల్లో ఉండడమే కాకుండా ప్రజా సమస్యల పరిష్కారంలో నాయకులు, కార్యకర్తలు కష్టపడి పని చేయాలని సూచించారు. మంత్రిని కలిసిన వారిలో మణికొండ బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కుంబగల్ల ధనరాజ్, మణికొండ వార్డు కౌన్సిలర్ వసంత్‌రావు చౌహాన్, ఆలస్యం నవీన్ కుమార్, సీనియర్ నాయకులు అందె లక్ష్మణ్‌రావు, సయ్యద్ ఆరిఫ్ మొహమ్మద్, సంఘం శ్రీకాంత్, రామసుబ్బారెడ్డి, ఉపేంద్రనాథ్‌రెడ్డి తదితరులున్నారు.

పడకేసిన పారిశుధ్యం

- గగన్‌పహాడ్‌లో రోడ్లపై మురుగు పరుగు
- పారిశుధ్య లోపంతో పరిస్థితి అధ్వానం
- పట్టించుకోని సంబంధిత అధికారులు

మైలార్‌దేవ్‌పల్లి, జూలై 14: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలో పారిశుధ్యం పడకేసింది. ఎక్కడి మురుగు అక్కడే పేరుకుపోవడంతో పరిస్థితి అధ్వానంగా తయారైంది. డివిజన్ పరిధిలోని కాటేదాన్, గగన్‌పహాడ్, దుర్గానగర్, లక్ష్మిగూడ, వాంబే కాలనీ, ఉడ్డెంగడ్డ ప్రాంతాల్లో పారిశుధ్య పనులు నిర్వహించకపోవడంతో చెత్తచెదారాలు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో ప్రజలకు అవస్తలు తప్పడం లేదు. డివిజన్ పరిధిలో గతంలో డెంగ్యూ, అతిసార వ్యాధులు సోకి పలువురు మృత్యువాత పడిన సంఘటనలు సైతం ఉన్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. అయినా అధికారులు మాత్రం చలనం లేనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెత్తను రోడ్లపైనే వేయడంతో పేరుకుపోయి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండదని ఆందోళనకు గురవుతున్నారు. డ్రైనేజీ కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తచెదారాలు పేరుకుపోవడంతో మురుగు ముందుకు కదలడం లేదు. కొద్దిపాటి వర్షం పడినా మురుగు రోడ్లపై చేరడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు రోజుల తరబడి మురుగు నిలిచిపోవడంతో దోమలు పెరిగిపోయాయని పేర్కొంటున్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన జీహెచ్ఎంసీ సిబ్బంది పట్టనట్టు వ్యవహరిస్తున్నారు.

కాటేదాన్ ప్రధాన రహదారిపై పేరుకుపోయిన చెత్తచెదారం

విజృంభిస్తున్న దోమలు..

బస్తీలు, కాలనీల్లో చెత్తచెదారాలు, మురుగు పరుగుతో దుర్గంధమైన వాతావరణం నెలకొని ఉంది. దీంతో దోమలు విపరీతింగా పెరిగి ప్రజలపై దండయాత్ర చేస్తున్నాయి. దినమంతా దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. దోమల కారణంగా మహిళలు, చిన్నారులు, వృద్ధులు అనారోగ్యాలకు గురై తరచుగా ఆసుపత్రుల చుట్టు తిరగాల్సి వస్తుందని వెల్లడిస్తున్నారు.

ఆందోళనలో ప్రజలు..

వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండడంతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవించాల్సి వస్తుంది. పారిశుధ్యం పడకేయడంతో సీజనల్ వ్యాధులపై ప్రజలు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. డెంగ్యూ, మలేరియా లాంటి వ్యాధులు సోకుతాయని భయంగుప్పిట్లో బతుకుతున్నారు. గతంలో డివిజన్ పరిధిలో డెంగ్యూ, అతిసార వ్యాధులు సోకి పలువురు మృత్యువాత పడిన సంఘటనలు సైతం ఉన్నాయని తెలిపారు. అటువంటి సంఘటనలు పునరావతం కాకుండా అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమవుతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుధ్యాన్ని మెరుగుపరిచి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు.

పేద విద్యార్థులకు సాయం అభినందనీయం



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్, వరప్రసాద్, శివారెడ్డి తదితరులు

ఖైరతాబాద్, జూలై 14: పేద విద్యార్థులకు ఎంఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ అన్నారు. లక్డీకాపూల్‌లోని ట్రస్ట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 300 మంది పేద విద్యార్థులకు సహాయత చెక్కులను ట్రస్ట్ నిర్వాహకులు శివారెడ్డి, జ్యోతివాస్తు పండితులు డాక్టర్ జీవీ వరప్రసాద్‌తో కలిసి అందజేశారు. ఎమ్మెల్యే అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. రెండేండ్లుగా ట్రస్ట్ ద్వారా ప్రతి ఏడాది వెయ్యి మంది పేద పిల్లల చదువుకు ఆర్థిక సాయం అందించడం గొప్ప విషమన్నారు. వారి సేవలు మరింత విస్తరించాలన్నారు. శివారెడ్డి మాట్లాడుతూ పేదలకు సేవ చేసుకునే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాని తెలిపారు. పది, ఇంటర్‌లో మంచి మార్కులు వచ్చి పై చదువులకు స్తోమతలేని వెయ్యి మంది పేద విద్యార్థులకు ప్రతి ఏటా రూ.10వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నానని తెలిపారు.

ఎంపీ, ఎమ్మెల్యేలకు సత్కారం

ఎంపీ, ఎమ్మెల్యేలను సత్కరిస్తున్న సంగీత, సత్యనారాయణ, సుదర్శన్ తదితరులు

ఖైరతాబాద్, జూలై 14: నూతనంగా పెద్దపల్లి ఎంపీగా ఎన్నికైన గడ్డం వంశీకృష్ణ, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామికి సత్కార కార్యక్రమం ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఈకో మోటార్స్, భీమ్ సైనిక్ ఫౌండేషన్ సంయుక్తాధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యేను ఈకో మోటార్స్ ఎండీ సంగీత, వ్యవస్థాపక సభ్యురాలు సుభాషిణి, భీమ్ సైనిక్ ఫౌండేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రోగ్రాం కోఆర్డినేటర్ సుదర్శన్ ఘనంగా సత్కరించారు. వివేక్ మాట్లాడుతూ.. 50 ఏండ్ల క్రితం తన తండ్రి గడ్డం వెంకటస్వామి (కాక) పేద విద్యార్థులకు చదువులు అందించాలన్న ఉద్దేశంతో అంబేద్కర్ విద్యాసంస్థను స్తాపించారన్నారు. నాటి నుంచి నేటి వరకు వేలాది మంది పేద విద్యార్థులకు విద్యనందించారన్నారు. కార్యక్రమంలో కూచిపూడి నృత్య శిక్షకురాలు లావణ్యశ్రీ, జన్నపు రాజు, సంపత్, శంకర్, సిద్ధిక్ తదితరులు పాల్గొన్నారు.

రజక, నాయీ బ్రాహ్మణ విద్యుత్ బకాయి చెల్లించాలి

జూబ్లీహిల్స్, జూలై 14: రజక, నాయీ బ్రాహ్మణులకు ఉచిత విద్యుత్ బకాయి వెంటనే చెల్లించాలని నాయి బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాచమల్ల బాలకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. పీర్జాదిగూడ నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు మాచర్ల రవి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో బాలకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. నాయీ బ్రాహ్మణ, రజకులకు రాష్ట్ర ప్రభుత్వం 250 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకానికి సంబంధించి రూ.100 కోట్లు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ప్రజా ఆకాంక్షలే శిరోధార్యం

జూబ్లీహిల్స్, జూలై 14: ప్రజల నిర్ణయం శిరోధార్యమని, మూడో సారి గెలిపించిన ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సేవలందిస్తానని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి అన్నారు. మల్లు రవి జన్మదినం సందర్భంగా నగరంలోని గాయత్రిహిల్స్‌లో ఆయన నివాసంలో పార్టీ ప్రజాప్రతినిధులు, అభిమానులు పెద్ద ఎత్తున వేడుకలు నిర్వహించారు. మల్లు రవి 73వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా టీటీడీ మాజీ డైరెక్టర్ బీఎస్ మోహన్, పాతబస్తీ నాయకులు నరేశ్‌తో కలిసి 73 కిలోల కేక్‌ను కట్ చేయించారు. నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుంట్ల రాజేశ్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. శాలువాతో సత్కరించి భారీ గజమాలతో సన్మానించారు.

కుస్తీ పోటీలతో క్రీడాకారుల్లో పట్టుదల

విజేతలకు బహుమతులు అందజేస్తున్న నవీన్‌యాదవ్, శ్రీశైలంయాదవ్ తదితరులు

జూబ్లీహిల్స్, జూలై 14: కుస్తీ పోటీలతో క్రీడాకారుల్లో పట్టుదల పెరుగుతుందని, రెజ్లర్లు విజయం సాధించే వరకు శ్రమిస్తారని జూబ్లీహిల్స్ కాంగ్రెస్ నాయకుడు వి.నవీన్ యాదవ్ అన్నారు. ఆదివారం యూసుఫ్‌గూడ వల్లల గ్రౌండ్‌లో తెలంగాణ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-23 రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి శ్రీశైలంయాదవ్‌తో కలిసి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీజీఏడబ్ల్యూఏ ప్రెసిడెంట్ అహ్మద్ బిన్, కార్యదర్శి టి.సంజయ్‌కుమార్, చైర్మన్ హమ్జా బిన్ ఓమర్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

వారాంతపు సాంస్కృతిక ప్రదర్శనల్లో ఆదివారం మాదాపూర్‌లోని శిల్పారామంలో పలువురు కళాకారుల నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. బెంగళూరుకు చెందిన ప్లూట్ ఎంఫీట్ అకాడమీ నిర్వాహకులు అరణ్య నరైన్ శిష్య బృందంతో కలిసి ప్రదర్శించిన భరతనాట్య నృత్యాలు ప్రత్యేకంగా అలరించాయి. ప్రదర్శనల్లో విష్ణు కౌతం, శ్రీవల్లి, మాథెయ్ మళ్లెద్వజ, చూడ రేయ్, ప్రదోష కృతి, రంజని మల శివస్తుతి అంశాలను శ్రేయ, అనన్య, వర్ష, రీతూ, యశస్విని, శ్రావ్య, ప్రీతలు భరతనాట్య నృత్యరూపకంలో ప్రదర్శించిన తీరు ఆద్యంతం ఆకట్టుకుంది.

– కొండాపూర్, జూలై 14

ఎల్వోసీ అందజేత

సీఎంఆర్ఎఫ్ ఎల్వోసీ అందజేస్తున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

జూబ్లీహిల్స్, జూలై 14: రహ్మత్‌నగర్ డివిజన్ శ్రీరాంనగర్‌కు చెందిన ఖాజా మొయినుద్దీన్‌కు సీఎంఆర్ఎఫ్ పథకంలో మంజూరైన రూ.1 లక్ష ఎల్వోసీని కార్పొరేటర్ సీఎన్ రెడ్డి ఆదివారం తన కార్యాలయంలో లబ్ధిదారుకు అందజేశారు.

వివాహిత అదృశ్యం

జూబ్లీహిల్స్, జూలై 14: బంజారాహిల్స్ రోడ్ నంబర్-2లోని సాగర్ సొసైటీకి చెందిన వివాహిత (25) అదృశ్యమైన సంఘటన శనివారం చోటుచేసుకుంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో రాత్రి 8.30 గంటలకు బయటకు వెళ్లింది. తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువుల వద్ద వెతికినా ఫలితం లేకపోయింది. ఆమె ఫోన్ సైతం స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో ఆదివారం బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో భర్త ఫిర్యాదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చాముండేశ్వరి పీఠంలో పూజలు

లక్ష్మీనారాయణకు స్వామి వారి ప్రతిమను అందజేస్తున్న పూజారి

వెంగళరావునగర్, జూలై 14: శ్రీనగర్‌కాలనీలోని శ్రీకృష్ణ చాముండేశ్వరి పీఠంలో వారాహి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం జరిగిన వేడుకల్లో జేడీ లక్ష్మీనారాయణ పాల్గొని పూజలు చేశారు. నవరాత్రి ఉత్సవాలు శ్రీకృష్ణ చాముండేశ్వరి పీఠంలో ఘనంగా నిర్వహించినట్లు చాముండేశ్వరి మహర్షి తెలిపారు.

శాకంబరి ఉత్సవాలకు పోటెత్తిన భక్తులు

పెద్దమ్మ ఆలయంలో శాకంబరి ఉత్సవాల్లో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

జూబ్లీహిల్స్, జూలై 14: జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి ఆలయంలో ఆదివారం శాకంబరి ఉత్సవాలకు భక్తులు పోటెత్తారు. జీవకోటికి ఆకలితీర్చిన శాకంబరి దేవికి మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా జూలై 13 నుంచి 15వ తేదీ వరకు కూరగాయల పంట తొలిదశ దిగుబడితో అట్టహాసంగా పూజలు నిర్వహించారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన వేలాదిమంది భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించి, బోనాలు సమర్పించుకున్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, ఆలయ ఫౌండర్ ట్రస్టీ విష్ణు వర్ధన్‌రెడ్డి కుటుంబ సమేతంగా పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకొన్నారు.

పారిశుధ్య కార్మికుల సేవలు ఎంతో గొప్పవి

మణికొండ, జూలై 14: పారిశుధ్య కార్మికుల సేవలు ఎంతో గొప్పవని, వారి పనికి తగిన గుర్తింపు ఇవ్వాలని మణికొండ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి అన్నారు. భారత్ వికాస్ పరిషత్ తెలంగాణ ప్రాంత ఎన్విరాన్‌మెంటల్ కన్వీనర్ రఘు సతీశ్‌కుమార్, ఏఐసీఎస్పీ ప్రెసిడెంట్ రామానుజ, ఏఐసీఐసీ ప్రెసిడెంట్ వెంకటేశ్వర రావు ఆధ్వర్యంలో ఆదివారం మణికొండ మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికులకు సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులను ఘనంగా సన్మానించి వారి సేవలను కొనియాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలు మేల్కొనక ముందే బస్తీల్లోని వీధిని, ఊరిని ప్రజల కోసం ముస్తాబు చేస్తారన్నారు. చీపురు పట్టి ఊడ్చి వెన్నునొప్పితో బాధపడే కార్మికులు వారు పడే కష్టానికి తగిన గుర్తింపు ఎంతో అవసమన్నారు. ఈ సందర్భంగా సుమారు 270 మంది కార్మికులను ఘనంగా సన్మానించామన్నారు. కార్యక్రమంలో మణికొండ మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్, కౌన్సిలర్స్ శ్రీకాంత్‌స్వామి, శైలజ, పద్మారావు, కోఆప్షన్ సభ్యులు సిద్ధప్ప, లక్ష్మి, మాజీ ఎంపీటీసీ ఎం.రాఘవ రెడ్డి, మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు సి.బీరప్ప, నాయకులు సీహెచ్ ఇందిర, ప్రభావతి, బి.రవికాంత్‌రెడ్డి, ఆనంద్‌రావు, శివరాంరెడ్డి, ఎంప్లాయిస్ కాలనీ చైర్మన్ పి.జంగయ్య, అధ్యక్షుడు పెంటారెడ్డి, అడ్వైజర్ బాబ్జి, కాలనీలవాసులు పాల్గొన్నారు.


పారిశుధ్య కార్మికుల సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి తదితరులు

రెజ్లింగ్‌లో బంగారు పతకం.. యువకుడికి సన్మానం

ఎర్రగడ్డ, జూలై 14: నగరంలో ఇటీవల జరిగిన జిల్లాస్థాయి రెజ్లింగ్‌లో బోరబండకు చెందిన అనీష్ ముదిరాజ్ 97 కేజీల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని కైవసం చేసుకొన్నాడు. అనీష్‌ను బోరబండ ముదిరాజ్ సంఘం తరపున ఆదివారం ఘనంగా సన్మానించారు. యువకుడి తండ్రి నరేందర్‌తో పాటు కుటుంబ సభ్యులను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రాములుముదిరాజ్, చక్రపాణి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ఫుట్‌పాత్‌పై పడిఉన్న గుర్తుతెలియని మృతదేహం

జూబ్లీహిల్స్, జూలై 14: బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రోడ్ నంబర్-12 మంగళ హ్యాండిక్రాఫ్ట్స్ షాప్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ ఆదివారం తెలిపారు. ఫుట్‌పాత్‌పై 35 నుంచి 40 ఏండ్ల వ్యక్తి అపస్మారకస్థితిలో పడి ఉన్నాడన్న స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. 108 ద్వారా చికిత్స అందించేందుకు ప్రయత్నించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి ఒంటిపై బ్లూ కలర్ టీ షర్ట్, బ్లాక్ ట్రౌజర్ ఉంది. కుడి చేతిపై టాటూ ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. వివరాల కోసం 87126 60456 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

LOST DOCUMENT

Under the instructions from my client Mr. A.Krishna Reddy S/o A Janardhan Reddy, R/o. H.No 1-113, Grama Panchayathi, Narasimulapet, Warangal, T.S. do hereby state that he has lost his document by following means Lost Document
A Krishna Reddy S/o A Janardhan Reddy, R/o. H.No. 1-113, Grama Panchayati, Narasimulapet, Warangal, T.S. Lost My Document No. 2276/1980 While I was traveling by my bike from Venkateshwara colony to Mailardevpally, Hyderabad. If anybody found my documents bearing No. 2276/1980 mentioned above, please inform to me this is my phone number :9014461600

Sd/- **V.SHIVA SHANKAR,**
ADVOCATE
H.No.4-7-127/2/2/5, N.M Guda, Maruthi Nagar, Attapur, Hyd
Ph.No: 8328545585.